# ప్రజా హృదయం

దిబ్బ పత్రిక ఎడిటరు మహా చిరచిరలాడుతున్నాడు.

"ఏమయింది?" అన్నాను.

"ఎలెక్షను!... పాత ప్రభుత్వమే గెలవాలని రోజూ సంపాదకియాలు రాశాను. ఎక్కడో ఉత్తరదేశంలో పాత ప్రభుత్వం ఓడిపోయిందిట. నాకు రోజూ తిట్లు ఉత్తరాలు! నేను కిరాతకాన్నీ, నియంతృత్వాన్నీ, పైశాచిక పరిపాలననూ, ప్రజా శత్రువులనూ సమర్థించి ప్రజలకూ, ప్రజాతంత్రానికీ ద్రోహం చేశామట! నాకు రాజకీయ పరిజ్ఞానం లేదుట! నా సంపాదకత్వం కింద దిబ్బ పత్రిక ప్రజలను అజ్ఞానాంధకారంలో ఉంచిందిట!"

"విచారించకు. దిబ్బలో ఒక్క సీటుకూడా పోకుండా అన్నీ పాత ప్రభుత్వానికే దక్కాయిగద! ప్రజలు తమకు నియంతృత్వమూ, దౌర్జన్యమూ కావాలనీ, స్వేచ్ఛ అక్కర్లేదనీ ఎలుగెత్తి చాటి చెప్పారు. ప్రజా హృదయాన్ని నువు చాలా కరెక్టుగా ప్రతిబింబించావు!" అన్నాను.

"వాళ్లకు రాజకీయ పరిజ్ఞానం చేసింది నేనేట!"

"తమ్ముడూ, ప్రజలకు రాజకీయ పరిజ్ఞానం కలిగించాలని రాజకీయవేత్తలే తాపత్రయపడరు. కందకు లేని దురద కట్టిపీటకా? ఎన్నికలు వచ్చినప్పుడు ప్రజాభిప్రాయం తమ పక్షాన ఉండాలని కోరటానికి మీటింగులు పెట్టి, ఏవో ప్రచారాలు చేస్తారు. ఇప్పుడు గెల్చిన పార్టీకి దక్షిణాది యావత్తూ వ్యతిరేకంగా వోటు చేసింది. వాళ్లకేమన్నా బాధా? కేంద్రం కోటలో పాగా వెయ్యటానికి అడ్డం రాలేదు. అందుచేత దక్షిణాది వేరే దేశమల్లే ప్రవర్తించినా వాళ్లకి బాధలేదు. అందుచేత నువు గమ్మునుండు! నిన్ను విమర్శించిన వారితో, నాకూ, మా దిబ్బకూ పంచమహా పాతక పరిపాలనే కావాలని చెప్పు, వాళ్ల రోగం కుదురుతుంది!" అన్నాను.

***ముద్రణ : యువ, మార్చ్ 1977***